క్లుప్తంగా

ములుగుపల్లిలో ర్యాలీ



మహాముత్తారం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంకల్పసప్త కార్యక్రమంలో భాగంగా మండలంలోని ములుగుపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ దూలం మల్లయ్య ఆధ్వర్యంలో గురువారం మహిళలు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం పరుగుపందెం కార్యక్రమం నిర్వహించారు. పరుగుపందెంలో గెలుపొందిన మహిళలకు, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమ అనంతరం గ్రామస్తులు నితిఆయోగ్ కార్యక్రమంలో భాగంగా ఢిల్లీ వెళ్లివచ్చిన సర్పంచ్ దూలం మల్లయ్య గౌడ్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మీనా, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళాసంఘం సభ్యులు తదితరులు ఉన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ

వాజేడు: మండల పరిధిలో గుట్టలపై ఉన్న పెనుగోలు గ్రామంలో గురువారం దోమల మందును పిచికారీ చేశారు. వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన హెల్త్ అసిస్టెంట్ చిన్న వెంకటేశ్వర్లు బుధవారం ఇద్దరు మనుషులతో కలిసి కాలినడకన గుట్ట పైకి చేరుకున్నారు. రాత్రి అక్కడే బస చేసి గురువారం ఉదయం గ్రామంలోని అన్ని ఇళ్లల్లో దోమల నివారణ మందును పిచికారీ చేశారు.

ఏడ్జర్లపల్లిలో వైద్యశిబిరం



వాజేడు: మండల పరిధిలోని ఏడ్జర్లపల్లి గ్రామంలో గురువారం వైద్యాధికారిని జ్ఞానస ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న వారిని వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పరీక్షల నిమిత్తం పంపించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామస్తులతో మాట్లాడుతూ కాచి చల్లార్చి, వడ బోసిన నీటిని తాగాలని, దోమ తెరలను వాడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గోళాలు, డ్రమ్ములపై మూతలు పెట్టుకోవాలని చెప్పారు. స్రవంతి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రైతుల రుణమాఫీపై ప్రభుత్వ నిర్లక్ష్యం



ఏటూరునాగారం: రైతుల రుణ మాఫీపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ప్రభుత్వం ఇచ్చిన గడువు ముగిసినా ఇంత వరకు రుణాలు రెన్యూవల్ చేయలేదని రైతు సంఘం మండల కమిటీ అధ్యక్షుడు వడ్కాపురం సారయ్య అన్నారు. గురువారం మండలంలోని చిన్న బోయినపల్లిలో రైతు సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సా రయ్య మాట్లాడుతూ.. రైతులు బ్యాంకుల్లో తీసుకున్న రూ.లక్ష లోపు రుణాలను గత నెలలో రైతుల ఖా తాలో ప్రభుత్వం డబ్బు జమ చేసిందన్నారు. కానీ రైతులకు మళ్లీ బ్యాంక్ అధికారులు రుణం ఇవ్వడం లేదన్నారు. బ్యాంక్ అధికారులు రైతులకు లేనిపోని మాటలు చెప్పి ప్రభుత్వం నుంచి వచ్చిన డబ్బును వారే నిల్వ చేసుకుంటున్నారని ఆరోపించారు. రు ణాలు మాఫీ మళ్లీ రుణాలు ఇవ్వకపోతే ఆందోళన కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపడుతామన్నారు.

'సీతక్కను ఓడించేందుకు కుట్ర'



వెంకటాపురం(ఎం): ప్రజాసేవ చేస్తున్న ఎమ్మెల్యే సీతక్కను ఓడించేందుకు బీఆర్‌ఎస్ నాయకులు కుట్ర పన్నుతున్నారని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు చెన్నోజు సుర్య నారాయణ ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే సీతక్కను ప్రజలు గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ పార్టీకి చరమగీతం పాడి కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు ప్రజలు సన్నద్ధం కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జాటోతు గణేష్, జంగిలి రవి, చక్రపు శ్రీనివాస్, మాద ప్రకాష్, వీరేష్ నాయక్, కోరె బిక్షపతి, పవన్, మధుకర్, రవి, నాగరాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై యువత ఆసక్తి పెంచుకోవాలి



కాటారం: స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

మల్హర్: మండలంలోని మల్లారం, చిన్నతూండ్ల, కొయ్యూరు, కొండంపేట, ఇప్పలపల్లి గ్రామాల్లో కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లు, టీషర్ట్‌లను సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు క్రీడాకారులకు గురువారం అందజేశారు. గ్రామీణ క్రీడకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పల్లెల్లో తెలంగాణ క్రీడాప్రాంగణాల ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రభుత్వం అందించిన స్పోర్ట్స్ కిట్లను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు గోనె పద్మ శ్రీనివాసరావు, కుమారస్వామి, రాజేశ్వరి, మమత నర్సయ్య, సిద్ది లింగమూర్తి, ఎంపీటీసీ ప్రకాష్‌రావు, ఉప సర్పంచ్‌లు మమత, స్వప్న రాము, కార్యదర్శులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

కాటారం: యువత, విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకొని భవిష్యత్‌లో రాణించాలని ఎంపీపీ పంతకాని సమ్మయ్య సూచించారు. కాటారం గ్రామ పంచాయతీ క్రీడా ప్రాంగణానికి సంబంధించి ప్రభుత్వం ద్వారా మంజూరైన కేసీఆర్ క్రీడా కిట్ సామగ్రిని ఎంపీపీ పంతకాని సమ్మయ్య, స్థానిక సర్పంచ్ తోట రాధమ్మ క్రీడాకారులకు అందజేశారు. క్రీడాకారులు అందుబాటులో ఉన్న క్రీడాసామగ్రిని వినియోగించుకొని క్రీడా నైపుణ్యతను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్‌నాయక్, వైస్‌ఎంపీపీ చీర్ల తిరుమల, ఎంపీటీసీలు తోట జనార్దన్, మహేశ్ రవీందర్‌రావు, జాడి మహేశ్వరీ, హట్కర్ రూపా, ఎంపీఓ ఉపేంద్రయ్య, క్రీడాకారులు, యువత తదితరులు పాల్గొన్నారు.

పలిమెల: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి యువతకు సీఎం కేసీఆర్ స్పోర్ట్స్ కిట్‌లు పంపిణీ చేశారు. ఈ స్పోర్ట్స్ కిట్స్‌లో వాలీబాల్, క్రికెట్, డంబెల్స్, స్పోర్ట్స్ టీషర్ట్స్ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు చిడం నాగయ్య, రేగ నరేష్, తోట రమాదేవి, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

మహదేవపూర్: మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాణిబాయి ఆధ్వర్యంలో గురువారం కేసీఆర్ క్రీడా కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవీంద్రనాథ్, జెడ్పీటీసీ అరుణ, ఎంపీటీసీ అకుతోట సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



మహదేవపూర్‌లో..



మల్హారంలో



పలిమెలలో..

పట్టణాలకు దీటుగా పల్లెల్లో అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

మొగుళ్లపల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాత పట్టణాలకు దీటుగా పల్లెల్లో అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నూతనంగా నిర్మించిన మెట్టుపల్లి, కాసులపాడు, పోతుగళ్లు,అంకుషాపురం, పాత ఇస్సిపేట గ్రామాల్లో పంచాయతీ భవనాలను ప్రారంభించారు. అనంతరం గ్రామాల్లోని మహిళలకు బతుకమ్మ చీరలను, కుట్టు మిషన్లు, లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసిన ప్రజలు నమ్మకుండా చేసిన అభివృద్ధిని చూసి ఆదరించండని కోరారు. రాబోయే ఎన్నికల్లో ఏ గ్రామం నుంచి ఎక్కువ మెజార్టీ ఓట్లు వస్తే ఆ గ్రామానికి రూ.10 లక్షల నగదు పురస్కారాన్ని అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, ఎంపీపీ సుజాత సంజీవరెడ్డి, జెడ్పీటీసీ జోరుక సదయ్య, చిట్యాల మార్కెట్ చైర్మన్ కొడారి రమేష్, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బలుగూరి తిరుపతి రావు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు చదువు అన్నారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నరసింగారావు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సుధాకర్ పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న ప్రజాప్రతినిధులు

టేకుమట్ల: టేకుమట్ల-రాఘవరెడ్డిపేట గ్రామాల మధ్య గల చలివాగు వంతెన ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తెగిపోవడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో స్పందించిన ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి వంతెన పునర్‌నిర్మాణానికి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకుపోగా రూ.5కోట్ల నిధులను మంజూరు చేశారు. ఈ సందర్భంగా గురువారం మండల ప్రజాప్రతినిధులు, నాయకులు మండల కేంద్రంలో సీఎం, ఎమ్మెల్యే చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీలు చదువు మధురమహేందర్‌రెడ్డి, పాలాల సరోత్తంరెడ్డి, బిల్లకంటి ఉమేందర్‌రావు, అడగాని లతారామారావు, నందికొండ శోభామహిపాల్‌రెడ్డి, ఆది రఘు, సంగి రవి, పింగిళి వెంకటేశ్వర్‌రెడ్డి, గందం వజ్ర సారయ్య, మండల ప్రధాన కార్యదర్శి ఆకునూరి తిరుపతి, నాయకులు బొల్లు సరోత్తంరెడ్డి, తుమ్మేటి సురేందర్‌రెడ్డి, చిలుక మల్లయ్య, గువ్వాడి లక్ష్మన్, పసరగొండ లక్ష్మన్, ఓదెల రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఫలితాల్లో యువకుల ప్రతిభ

మహదేవపూర్: మండలంలోని వివిధ గ్రామల నుంచి ఏడుగురు యువకులు బుధవారం వెలువడిన కానిస్టేబుల్ ఫలితాల్లో కానిస్టేబుల్‌గా ఎంపికైయ్యారు. మహదేవపూర్‌కు చెందిన తుంగల రాకేష్, తండ్ర అభినవ్, షెక్ మనుసూర్, ఎడపల్లి గ్రామనికి చెందిన మోతె పవన్ కల్యాణ్, సూరారం గ్రామనికి చెందిన నాగుల మహేష్, కాళేశ్వరం గ్రామనికి చెందిన చింతకింది రవితేజ, అన్నారం గ్రామానికి చెందిన పర్శబోయిన దుర్గ ప్రసాద్ కానిస్టేబుల్‌గా ఎంపికైయ్యారు.

కానిస్టేబుల్‌గా ఎంపికైన ఆనంద్



బిడెం ఆనంద్

పలిమెల: మండలంలోని పంకెన గ్రామానికి చెందిన బిడెం రాజయ్య-చిన్నక్క దంపతుల కుమారుడు ఆనంద్ బుధవారం పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రకటించిన కానిస్టేబుల్ ఫలితాల్లో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికై య్యాడు. పేద కుటుంబంలో పుట్టిన ఆనంద్ చిన్నప్పటి నుంచి చదువులో చురుకుగా ఉండేవాడని తల్లిదండ్రులు తెలిపారు. బీఎస్సీ (అగ్రికల్చర్) చదువుకున్న ఆనంద్ ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే తపనతో రాసిన మొదటి ప్రయత్నంలోనే సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపిక అవడంపై తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. పంకెన నుంచి మొట్టమొదటి ప్రభుత్వ ఉద్యోగిగా అది కూడా పోలీస్ ఉద్యోగానికి ఎంపిక కావడం విశేషం.

టేకుమట్ల: పోలీస్ ఉద్యోగమే లక్ష్యంగా అన్నాచెల్లెల్లు పోటీపడీ కష్టపడి చదివారు. కష్టానికి ప్రతిఫలంగా 2020లో చెల్లె సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపిక కాగా, అన్న బుధవారం వెలువడిన కానిస్టేబుల్ పరీక్ష ఫలితాల్లో టీఎస్ఎస్‌పీ కానిస్టేబుల్‌గా ఎంపికై లక్ష్యాన్ని సాధించారు. వివరాలిలా ఉన్నాయి. చిట్యాల మండలంలోని జూకల్ గ్రామానికి చెందిన బయగాని శ్రీనివాస్-రాజమణి దంపతులకు రాజేష్, రంజితలు సంతానం. కాగా రంజిత మహిళా కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించి 2020 నుంచి టేకుమట్ల పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తుంది. గురువారం వెలువడిన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో రాజేష్ టీఎస్ఎస్‌పీ కానిస్టేబుల్‌కు ఎంపికయ్యారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చిట్యాల: మండలంలోని ఒడితల గ్రామానికి చెందిన ఎండీ రహీం పాషా (23) అనే వ్యక్తి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ ఎంజీఎంలో మృతి చెందాడు. గ్రామస్తులు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఒడితల గ్రామానికి చెందిన ఎండి రహీం పాషా మూడు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు చూసి చిట్యాల సివిల్ ఆస్పత్రికి తీసుకెళ్లి అనంతరం ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

పెంచిన వేతనాలు చెల్లించాలి

మంగపేట: ప్రభుత్వం మధ్యాహ్న భోజన వంట కార్మికులకు పెంచిన వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని మధ్యాహ్న భోజన పథకం కార్మికులు తహసీల్దార్, మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ బైరి వీరస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి పర్వీనా మాట్లాడుతూ.. సంవత్సరం క్రితం ప్రభుత్వం మధ్యాహ్న భోజన వంట కార్మికులకు వేతనాలు పెంచుతూ జీఓ నంబర్ 08ని విడుదల చేసి నేటి వరకు పెంచిన వేతనాలను చెల్లించలేదన్నారు.

నేడు వాహన వేలం

మహదేవపూర్: మండలంలో గుడుంబా తరలిస్తూ పట్టుబడిన వాహనానికి నేడు(శుక్రవారం) వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు పట్టుబడిన పల్సర్ బైక్‌ను వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆశక్తి గల వారు వేలంపాటలో పాల్గొనాలని ఎస్సై పేర్కొన్నారు.

తనిఖీ



తనిఖీ చేస్తున్న అధికారులు

పలిమెల: మండలంలోని లెంకలగడ్డ గ్రామంలో గురువారం సెర్ప్ హైదరాబాద్ డైరెక్టర్ నరసింహస్వామి ఆధ్వర్యంలో ఎస్‌జీహెచ్ సభ్యుల జీవనోపాధుల తనిఖీ జరిగింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సురేష్, డీబీఎం అంజనేయులు, జిల్లా ఏపీఎం అవినాష్, మండల ఏపీఎం ఇందారపు రవికుమార్, సీసీ స్వామి, ఎంఎస్ఏ సింధు, వీఏఓ పాల్గొన్నారు.

విధుల్లో చేరిన అంగన్‌వాడీ సిబ్బంది



సీడీపీఓకు పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

వెంకటాపురం(కె): వెంకటాపురం అంగన్ వాడీ ప్రాజెక్టు పరిధిలోని వాజేడు మండలానికి చెందిన 74, వెంకటాపురం మండలానికి చెందిన 94 అంగన్ వాడీ కేంద్రాలకు చెందిన అంగన్ వాడీటీచర్లు, ఆయాలు గురువారం విధుల్లో చేరారు. ఈ మేరకు సీడీపీఓ శిరీషకు జాయినింగ్ అవుతున్నట్లుగా పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మీనాకుమారి, అరుణ కుమారి, సమ్మక్క తదితరులు ఉన్నారు.

కళాశాలలో బొడ్డెమ్మ వేడుకలు



బొడ్డెమ్మ ఆడుతున్న విద్యార్థినులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రాంపాక అవిలయ్య ఆధ్వర్యంలో గురువారం బొడ్డెమ్మ వేడుకలను నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు ఆటపాటలతో ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ కొమ్మాల సంధ్య, అధ్యాపకులు రాములు నాయక్, భిక్షం, శ్వేత, రాజ్ కుమార్, రాజు, అశోక్ శ్రీలత, నాగరాజు, హరికృష్ణ, దివ్య పాల్గొన్నారు.

ఘనంగా 'కాకా' జయంతి



మల్హర్: ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ప్రభాకర్



కాటారం: కాకా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మల్హర్: కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి(కాకా) జయంతి వేడుకలు మండలంలోని తాడిచర్ల బీజేపీ మండల అధ్యక్షుడు ముడుతనపల్లి ప్రభాకర్ ఆధ్వర్యంలో గురువారం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాకా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభాకర్ మాట్లాడుతూ.. వెంకటస్వామి బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం కృషి చేసిన మహనీయులని కొనియాడారు. తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రాగం సతీష్, సుగుణాకర్ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు సమ్మయ్య, మండల కార్యదర్శి శ్రావణ్, సంజీవ్, సుదర్శన్, పోచయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాటారం: దివంగత కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి(కాకా) 94వ జయంతి వేడుకలను గురువారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కాకా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కోశాధికారి దుర్గం తిరుపతి మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలోని బడుగు బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం కాకా ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. యువ మోర్చా ప్రధాన కార్యదర్శి పాగె రంజిత్, కిసాన్ మోర్చ ప్రధాన కార్యదర్శి బండం మల్లారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు పూసాల రాజేంద్రప్రసాద్, గంట అంకయ్య, జాడి లక్ష్మణ్, ఉడుముల వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి, రవీందర్, రవి ఉన్నారు.

ప్రజలను మోసం చేసిన ప్రభుత్వం



కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

టేకుమట్ల(భాగిర్తిపేట): బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీపతి సంతోష్ అన్నారు. రేగొండ మండలంలోని భాగిర్తిపేటలో కాంగ్రెస్ మేనిఫెస్టో గ్యారెంటీ పథకాల కరపత్రాలను గురువారం ఇంటింటికీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ఎన్నికల సమయంలో ఎన్నో హామీలను ఇచ్చి ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. రానున్న రోజుల్లో ప్రత్యేక తెలంగాణ స్వప్నాన్ని నెరవేర్చిన కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఆరు గ్యారెంటీ పథకాలతో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో రూపొందించిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గడ్డం వెంకటస్వామి, ఆకుతోట రంజిత్, మాటూరి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే పథకాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

కాటారం: అర్హులైన నిరుపేదలకు మాత్రమే దళిత బంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు, గృహలక్ష్మి లాంటి ప్రభుత్వ పథకాలు ఇవ్వాలని ప్రజా సంఘాల నాయకులు పీక కిరణ్, అక్కల బాపు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గంలో పలు పథకాల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు చోటు చేసుకొని అర్హులైన వారికి అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. లబ్ధిదారుల ఎంపిక అధికారులు కాకుండా బీఆర్‌ఎస్ నాయకులు చేపట్టారని ఆరోపించారు. అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి న్యాయం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు బెల్లంకొండ పోచయ్య, ఇసునం మహేందర్, బొబ్బిలి రాజయ్య, ఆషాడ రమేశ్ పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ



కాటారం: చీరలు పంపిణీ చేస్తున్న సర్పంచ్



మహదేవపూర్‌లో..

కాటారం: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు బతుకమ్మ కానుకగా అందజేస్తున్న చీరల పంపిణీ కార్యక్రమం గ్రామాల్లో కొనసాగుతోంది. మండలంలోని మేడిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అర్హులైన లబ్ధిదారులకు బతుకమ్మ చీరలను గురువారం సర్పంచ్‌లు, పాలకవర్గం సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతల సుధాకర్, వార్డు సభ్యులు వెన్నపురెడ్డి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మహదేవపూర్: మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో గురువారం బతుకమ్మ చీరలు తహసీల్దార్ లక్ష్మిరాజయ్య ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాణిబాయి, జెడ్పీటీసీ అరుణ, ఎంపీటీసీ సుధాకర్, ఎంపీడీఓ రవీంద్రనాథ్, బ్రహ్మణపల్లి సర్పంచ్ అశోక్‌రావు లబ్ధిదారులు పాల్గొన్నారు.

మరమ్మతు పేరుతో ప్రజాధనం వృథా



రోడ్డును పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

వెంకటాపురం(ఎం): ధ్వంసమైన రోడ్డుకు తాత్కాలిక మరమ్మతు పేరుతో బీఆర్‌ఎస్ నాయకులు రూ.లక్షలు దండుకుని ప్రజాధనం వృథా చేస్తున్నారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు జవహర్‌లాల్ ఆరోపించారు. నెలరోజుల క్రితం కురిసిన భారీ వర్షాల వల్ల మారెడుగొండ చెరువుకు గండి పడి కొట్టుకుపోయిన లక్ష్మీదేవిపేట-బుర్గుపేట గ్రామాల మధ్య ఉన్న రోడ్డును బీజేపీ నాయకులు గురువారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ..నెల రోజుల వ్యవధిలో రెండుసార్లు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి అధికారులతో బీఆర్‌ఎస్‌కు చెందిన కాంట్రాక్టర్లు కుమ్మక్కై ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు. శాశ్వత రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వెల్లడించారు. ఇప్పటికైనా శాశ్వతరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని లేనట్లయితే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. బీజేపీ మండలాధ్యక్షుడు కారుపోతుల యాదగిరి, వైద్యుల తిరుపతిరెడ్డి, తక్కెళ్లపల్లి సుమన్‌రావు, దేవేందర్ గౌడ్, సంజీవరెడ్డి, వేల్పుల శ్రీనివాస్, చందు, భాస్కర్ రెడ్డి, శ్రీదర్, రూప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.